క్లుప్తంగా

కోడూరులో నేడు విద్యుత్ కోత

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు శుక్రవారం ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలంగించే పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల పంచాయతీ వంగిమళ్లవాండ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో రేపు (13-04-2025) ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామచంద్రారెడ్డి (శ్రీసిటీ) తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరబిందో కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించిన తర్వాత లోపమున్న వారిని గుర్తించి, అరబిందో ఆసుపత్రికి తరలించి వారికి ఆపరేషన్ చేయించి రోగులను ఇళ్లకు చేర్చనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పుల్లంపేట : మండలంలోని అనంతంపల్లి గ్రామంలో శుక్రవారం సీతారాముని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పూజారి శివశర్మ ఆధ్వర్యంలో దేశ ప్రకాష్ రెడ్డి, హరిత దంపతులు రాములోరి కల్యాణ క్రతువు జరిపారు. మహిళలు పెద్దసంఖ్యలో కల్యాణ వేడుకను తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

కల్యాణంలో పాల్గొన్న మంత్రి

సంబేపల్లె : మండల పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణానికి రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి చేతులమీదుగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అంతకుముందుకు స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు గావించారు.

ఫ్లెక్సీ మీద పడి ఫీల్డ్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు




రాజేష్‌ను పరామర్శిస్తున్న ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పొన్నా రాజేష్‌కు గాయాలయ్యాయి. ఫీల్డ్ అసిస్టెంటు పొన్నా రాజేష్ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో కొత్త మాధవరంలో విధులు నిర్వహిస్తుండగా గురువారం రాత్రి ఒక్క సారిగా గాలులు వీచడంతో ఫ్లెక్సీ మీద పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని రాజేష్‌ను కడప ఆసుపత్రికి తరలించారు. గాయపడిన రాజేష్‌ను శుక్రవారం ఉపాధి ఏపీడీ సోమశేఖర్ రెడ్డి, ఏపీఓ నరసింహులు పరామర్శించారు.

సత్యమ్మకు పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొజ్జవారిపల్లిలో వెలసియున్న సత్యమ్మ ఆలయంలో శుక్రవారం మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే భక్తులందరూ సహస్ర నామాలతో కుంకుమార్చన జరిపారు.

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సుండుపల్లె : మండల పరిధిలోని మండల సమాఖ్య కార్యాలయంలో రాయలసీమ హరిజన, గిరిజన, మైనార్టీ, వెనుకబడిన తరగతుల సంస్థ కోఆర్డినేటర్ ముబారక్ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక అక్షరాస్యత గురించి శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత పెంచడం, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఖాతాలు ఉపయోగంలో లేకపోవడం, ఖాతాలకు నామినీలు లేకపోవడం, ఖాతాదారులు చనిపోయినప్పుడు వారి వారసులకు తెలియకపోవడం, వరుసగా 10 సంవత్సరాలు ఖాతా లావాదేవీలు జరపకపోవడం వలన డిపాజిటర్ ఎడ్యుకేటెడ్ అవేర్‌నెస్ ఫండ్‌కు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాల గురించి తెలియజేస్తూ ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ వారి బ్యాంకుల ఖాతా విషయాలను ఎవరికీ తెలియజేయకుండా జాగ్రత్తపడాలన్నారు. పిల్లలకు మొబైల్స్ ఇవ్వకుండా, పిల్లలు ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి పోకుండా చూసుకోవాలని తెలియజేశారు. బీమా పథకాల అవసరాన్ని కళాజాత ద్వారా వివరించారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే

- సామాజిక సంస్కర్తకు ఘన నివాళి
- ఆయన ఆశయాలు, స్ఫూర్తిని కొనసాగించాలంటూ పిలుపు
- రాజంపేటలో నివాళి అర్పించిన ఎమ్మెల్యే ఆకేపాటి



రైల్వేకోడూరు అర్బన్: పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజంపేట టౌన్: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకేపాటి తదితరులు



రాయచోటి అర్బన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో..

రాజంపేట టౌన్ : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే అని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కొనియాడారు. జ్యోతీరావుపూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అంటరానితనం, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పూలే అన్నారు. విద్యతోనే కులవివక్ష, అంటరానితనాన్ని పారద్రోలవచ్చని పూలే దంపతులు ఉపాధ్యాయులుగా మారి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్యను నేర్పించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు వడ్డే రమణ, దాసరి రమేష్‌గౌడ్, గోవిందు బాలకృష, దండు గోపి, తంబా సుబ్రమణ్యం, అప్పారాజుపేట శివయ్య, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాసరాజు, మిరాయల సురేఖ, సుజాత, సనిశెట్టి నవీన్ కుమార్, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్, శంకర్ శెట్టి, ఖాజా మొహిద్దీన్, అబ్దుల్ మునాఫ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండలం పరిధి భాకరపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ జ్యోతీరావు పూలే ఒక భారతీయ సామాజిక సంస్కర్త, రచయిత, జ్యోతీరావు పూలే కులవివక్షతపై ఎన్నో పోరాటాలు చేసి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. దేశంలో కుల వివక్షతను రూపుమాపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్‌లు థియోఫిలాస్, వెంకట్‌రెడ్డి, వెంకటశివుడు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : మహాత్మ జ్యోతీరావ్ పూలే స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని శుక్రవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. పూలే జయంతి పురస్కరించుకొని వైస్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు పార్టీ పరంగా, రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చి వారి అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో మందల నాగేంద్ర, ఇనమాల మహేష్, రామక్రిష్ణ, మల్లికార్జున, కరీముల్లా, రత్తయ్య, సురేష్, మహేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మహాత్మ జ్యోతీరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సత్యశోధక సమాజాన్ని స్థాపించి సమాజంలో కులవ్యస్థను, అంటరానితనాన్ని నిర్మూలించడానికి జీవితం మొత్తాన్ని అంకితం చేసిన మహనీయుడు పూలే అని తెలిపారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.



సిద్దవటం: పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమాండెంటు ఆనందరెడ్డి



సంబేపల్లెలోని ఆదర్శ పాఠశాలలో..

సామాజిక దార్శనికుడు పూలే

రాయచోటి అర్బన్ : సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్‌లు అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలకు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ బీసీ నేతలు ఆర్ల సుబ్బయ్య, పల్లపు రమేష్, సాంబశివ, నూర్ అహమ్మద్, రెడ్డిశేఖర్, నాగరాజు యాదవ్, శివయ్య, హరినాథ్, వెంకటేష్, సంజీవయ్య, ఫయాజ్ అహమ్మద్, గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రహిమాన్, సుగవాసి శ్యామ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణ, గంగయ్య, బసయ్య, రవి, గంగాధర్, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

సమయం ఉందన్న నిర్లక్ష్యం వద్దు

రాజంపేట టౌన్ : వచ్చే ఏడాది జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సమయం ఉందని విద్యార్థులు నిర్లక్ష్యం వహించకుండా ఇప్పటి నుంచే అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ప్రణాళికబద్ధంగా చదవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఏడాది జూన్ 1వ తేదీ ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యేవని, అయితే ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు ఏప్రిల్ 1వ తేదీ తరగతులను నిర్వహించాలని తీసకున్న నిర్ణయం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడగలదన్నారు. ముందుగానే తరగతులు ప్రారంభం కావడం, అన్ని పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు కూడా విద్యార్థుల చేతిలో ఉండటం వల్ల ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.చంద్రమోహన్, రామాంజనేయులు, సుధాకర్‌రాజ, రవిచంద్రనాయుడు, సుధాకర్, మల్లికార్జున, సుబ్రమణ్యంయాదవ్, ప్రవీణ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు హామీలను అమలుపరచాలి

రాజంపేట రూరల్ : ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు రాజంపేట నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను అమలు పరిచి అండగా నిలవాలని రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పూల భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తారని ఇచ్చిన హామీ అటకెక్కించారా అని నిలదీశారు. అన్నమయ్య డ్యామ్ నిర్మిస్తామని ఇచ్చిన మాట నీటిమూటలేనా అని ఎద్దేవా చేశారు. ఏరియా ఆసుపత్రిలో ట్రామా కేర్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వైద్యుల పనితీరును పర్యవేక్షించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆల్విన్ పరిశ్రమ స్థానంలో నూతన పరిశ్రమను ఏర్పాటు చేస్తే కొన్ని వందల మందికి జీవనాధరమవుతుందన్నారు. లోకో షెడ్‌ను పునరుద్ధరిస్తే ఎంతో మంది రైల్వే కార్మికులకు చేయూతనివ్వటంతో పాటు నందలూరు అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందాలి



రామాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం చింతలవాండ్లపల్లెలో శుక్రవారం జరిగిన రామాలయ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆత్మీయ స్వాగతం పలికి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, చెన్నారెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలానే మండలంలోని నల్లగుట్టపల్లె పాతపల్లెలో శుక్రవారం కనపర్తి పెంచల్‌రెడ్డి, చెన్నారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : రాజంపేట పట్టణంతో పాటు తాళ్లపాక, ఆకేపాడు, భువనగిరిపల్లి, చుండువారిపల్లి పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వైభవంగా హరిహర సుతుడి జన్మదిన వేడుకలు

రాజంపేట రూరల్ : అయ్యప్పస్వామి జన్మదినాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని పూజలు చేయించారు. అనంతరం భక్తులు, అమరనాథరెడ్డి స్కూల్ విద్యార్థులకు ఆకేపాటి అన్నప్రసాదం అందజేశారు. అలానే పట్టణంలోని మణికంఠ నగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఉదయం అయ్యప్పస్వామికి ప్రధాన అర్చకులు కొత్తపల్లి రాఘవేంద్రస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని అత్తిరాలలోని బహుదానది వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా నదీస్నానం ఆచరింపజేశారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.



రాజంపేట రూరల్: బహుదానది తీరంలో అయ్యప్పకు అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

ఓబులవారిపల్లె : తిరుపతి జిల్లా జీవకోన 18 అవతారాల అయ్యప్పస్వామి ఆలయంలో డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18 అవతారాల అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా చంద్ర మౌళేశ్వర, నాగరాజు స్వాముల ఆధ్వర్యంలో చక్రస్నానం, అభిషేకం, గణపతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పవన్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

రామాపురం : మండలంలోని చిట్లూరు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలింత, గర్భిణులకు పరిశుభ్రతపై లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ వై.పద్మావతి అవగాహన కల్పించారు. మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహారం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. శిశువులకు ఇన్ఫెక్షన్ నివారించడానికి తల్లులు చేతులను శుభ్రంగా కడిగి పిల్లలకు ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భవతులు, తల్లులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనంను రుచి చూస్తున్న బీజేపీ నాయకులు

నందలూరు : మండలంలోని పాటూరు పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం సాయంతో నడుస్తున్న పథకాల అమలును శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ సూచనలు మేరకు రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ ఆధ్వర్యంలో పాటూరులో పర్యటించారు. సచివాలయంలోని సిబ్బందితో సమావేశమై పింఛన్లు, ఉచిత బియ్యం, ఉపాధి హామీ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ సాయంతో నడుస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పాటూరు బూత్ కమిటీతో సమావేశం నిర్వహించారు. మండల బీజేపీ సీనియర్ నాయకుడు ముంగి సుబ్బరాయుడును సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు ఏనుగుల బాలాంజనేయులు, మండల మాజీ కార్యదర్శి మురళీ, ప్రస్తుత కార్యదర్శి మహేష్, జయకుమార్ రెడ్డి, రమణ గౌడ్, మండల ఉపాధ్యక్షులు మండెం నాగేంద్ర, అశోక్ కుమార్, అనీల్, సుబ్బయ్య ఇతర బిజెపి కార్యకర్తలు హాజరయ్యారు.

చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోండి

పెనగలూరు : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాన్ని దుర్భాషలాడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. తమ ప్రియతమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కార్యకర్తలమైన తమ మనోభావాలు, ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాయని, కావున కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కురుగుంట్ల హరిప్రసాద్ నాయుడు, తిప్పన నాగభూషణం, పేరం రెడ్డయ్య నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆకట్టుకున్న రంగోలి

ఒంటిమిట్ట : ఏకశిలనగరంలో కోదండ రాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం రమణీయంగా జరిగింది. కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ రంగోలి కళాకారుడు అక్షయ్ జలిహాల్ వేసిన సీతారాముల చిత్రం భక్తులను ముగ్ధులను చేసింది. కళాకారుడి ప్రతిభను భక్తులు అభినందించారు.



సాయినాథునికి పూజలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన షిరిడీ సాయిబాబకు గురుపౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. చుట్టూ పక్కల ప్రాంతాల వచ్చిన భక్తులు సాయినాథుని దర్శించుకోగా, ఆలయ కమిటీ సభ్యులు వారికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సాయినాథుడు

సకాలంలో స్పందించిన రక్తదాత



బెంగళూరు హాస్పిటల్‌లో రక్తదానం చేస్తున్న సిద్దార్థ

చిట్వేలి : బెంగుళూరు హాస్పిటల్‌లో ఉన్న ఓ మహిళకు రక్తం కావాలంటూ చిట్వేలి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం ఇచ్చిన సమాచారం మేరకు చిట్వేలికి చెందిన సిద్దార్థ సకాలంలో స్పందించి శుక్రవారం రక్తదానం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన భాగ్యలక్ష్మి (35) అనే మహిళ పిత్తాశయంలో రాయి ఉండటంతో చికిత్స నిమిత్తం బసవేశ్వర నగర్‌లోని శ్యామ్‌బాగ్ హాస్పిటల్‌లో గురువారం చికిత్స నిమిత్తం చేరారు. ఆమెకు ఆపరేషన్ చేయాలంటూ త్వరగా రక్తం కావాలని డాక్టర్లు చెప్పారు. ఈ సమాచారాన్ని మానవత సంస్థకు అందింది. ఈ నేపథ్యంలో చిట్వేలికి చెందిన ఉపాధ్యాయులు (మానవత కన్వీనర్) దొండ్లవాగు శ్రీనివాసులు, కుమారుడు ప్రస్తుతం బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న సిద్దార్థ స్పందించి శుక్రవారం హాస్పిటల్‌కు వెళ్లి 32వ సారి రక్తదానం చేశారని సంస్థ అధ్యక్షులు కుంభగిరి మునిరావు తెలియజేశారు. సకాలంలో స్పందించి రక్తదానం చేసిన సిద్దార్థను మానవత బాధ్యులు, సభ్యులు అభినందించారు.